క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మనోహర్‌రెడ్డి

పుత్తూరు రూరల్: స్థానిక ఆరేటమ్మ ఆలయ ఆవరణలో గురువారం రాస్ సంస్థకు చెందిన మహిళా సంఘ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాస్ సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాస్ సేవలు మరింతగా విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, అన్బలగన్, మీనా, సుజాత, జమున, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

వెదురుకుప్పం: మండల పరిధిలోని కురివికుప్పంలో ఐదు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. కురివికుప్పం గ్రామానికి చెందిన రామచంద్రాశెట్టి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేసి అతని వద్ద ఉన్న 5 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతన్ని కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ నాగరాజుకు అప్పగించామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

1998 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగులు



ఉత్తర్వులు ఇస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: 1998 సంవత్సరం డీఎస్సీ అభ్యర్థులకు ఎంఈఓ రాజేంద్రప్రసాద్ గురువారం పోస్టింగులు ఇచ్చారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మండలానికి ఎనిమిది మంది ఉపాధ్యాయులను కేటాయించారని తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేసి విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఆదేశించారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండలకేంద్రంలోని పాలసముద్రం బీసీ బాలికల హాస్టల్‌ను ఎంపీడీఓ శ్రీనివాసన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిబంధనల మేరకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా ? లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను, ఇతర రికార్డులను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మదు పాల్గొన్నారు.

ప్రచార భేరి పోస్టర్ల విడుదల



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు

పుత్తూరు రూరల్: మతోన్మాద పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రచార భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగరి నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు సీపీఎం, సీపీఐ పార్టీలు సంయుక్తంగా ''మోదీని గద్దె దింపండి-దేశాన్ని కాపాడండి'' నినాదంతో ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు గురువారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రతి ఒక్కరూ కలిసి ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, నాయకులు భాస్కర్, బాబీ, బద్రి, సాయికిరణ్, సీపీఎం నాయకులు విజయ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఒరవ కాలువల సర్వే


పుత్తూరు రూరల్: పుత్తూరు చెరువుకు సంబంధించిన ఒరవ కాలువలు కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన చెరువు పరిసరాలతో పాటు, ఒరవ కాలువలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి సహకరించాలని కోరారు. కమిషనర్ వెంట కౌన్సిలర్లు ఏకాంబరం, పవన్‌కుమార్ ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పాలసముద్రం: రైతులు భూసార పరీక్షలు చేయించి, వాటి ఆధారంగా సాగుచేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో రైతులకు భూసార పరీక్ష, మట్టి నమూనా సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుబ్రమణ్యంరెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాకారం దిశగా సొంతింటి కల

- నకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు
- పుత్తూరులో మంజూరైన మొత్తం ఇళ్లు 1634
- నిర్మాణాలకు మంజూరైన నిధులు రూ.31.68 కోట్లు
- ఇప్పటికే పూర్తయిన ఇళ్లు 568



కల్యాణపురం లేఅవుట్‌లో పూర్తయిన ఇళ్లు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు పుత్తూరులో సకల సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్నాయి. పేదలందరికీ పక్కా ఇళ్లు పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కొత్త గ్రామాలు వెలుస్తున్నాయి. గత ప్రభుత్వం ఇళ్ల పేరిట పేదల నుంచి లక్షలకు లక్షలు వసూలు చేసుకుని మొండిచేయి చూపింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాలమైన లేఅవుట్లలో రోడ్లు, పార్కులు, స్కూళ్లు, ఆస్పత్రులు, ఇతర సామాజిక అవసరాల కోసం స్థలాలను కేటాయించి నిర్మాణాలు చేపట్టింది. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదును జమ చేస్తోంది. ఫలితంగా జగనన్న కాలనీల్లో పేదలకు తమ సొంతింటి కల అనేది సాకారమవుతోంది.

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో ప్రైవేటు స్థలాలను కొనుగోలు చేసి మరీ మున్సిపాలిటీలో కల్యాణపురం, నందిమంగళం, చెర్లోపల్లి లేఅవుట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రూరల్ మండలంలో అయితే ఏకంగా 12 లేఅవుట్లు వెలిశాయి. మంత్రి ఆర్‌కే రోజా ప్రతి 15 రోజులకు ఓసారి ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్నారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, ఇతరత్రా పనులు త్వరగా అయ్యేలా ముందస్తుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సౌకర్యం కల్పించారు. తాగునీటికి ఇబ్బది లేకుండా ముందస్తుగా బోర్లు వేయించి నీటి ట్యాంకులను ఏర్పాటు చేయించారు. ఇటీవల ఆప్షన్ త్రీ కింద ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుని ఇళ్లు కట్టిస్తోంది. ఫలితంగా పట్టణంలో ఇళ్ల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పుత్తూరు మున్సిపాలిటీలో వాస్తవానికి 1249 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 70 మందిని అనర్హులుగా గుర్తించి తొలగించారు. మిగిలిన 1,179 ఇళ్ల నిర్మాణాలకు గానూ ఇప్పటికే 333 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే పుత్తూరు రూరల్ మండలంలో మొత్తం 489 ఇళ్లు మంజూరు కాగా అనర్హులైన 34 మందిని తొలగించారు. మిగిలిన 455 ఇళ్లకు గాను 235 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 220 ఇళ్ల వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి.

రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల మేర ఆస్తి

పేదలందరికీ పక్కా ఇళ్ల పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఆస్తిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోంది. పట్టణ పరిధిలో ఒక సెంటు భూమితో పాటు నిర్మాణం పూర్తయిన చోట కనీసం రూ.15 లక్షల విలువ ఉంటుండగా, రూరల్ ప్రాంతంలో ఒకటిన్నర సెంటు భూమితో పాటు నిర్మాణం విలువ రూ.10 లక్షల వరకు పలుకుతోంది. తద్వారా ముఖ్యమంత్రి జగనన్న అక్కచెల్లెమ్మలకు లక్షల ఆస్తిని అందజేస్తున్నారు.

పరిధి	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	మంజూరైన నిధులు	విడుదలైన నిధులు
పుత్తూరు మున్సిపాలిటీ	1.179	333	రూ.22.48 కోట్లు	రూ.8.42 కోట్లు
రూరల్ మండలం	455	235	రూ.8.80 కోట్లు	రూ.4.44 కోట్లు
మొత్తం	1.634	568	రూ.31.28 కోట్లు	రూ.12.86 కోట్లు

నిధులకు కొరత లేదు..



జగనన్న ఇళ్ల నిర్మాణాలకు నిధుల కొరత లేదు. బిల్లులు పెండింగ్ లేవు. లబ్ధిదారులు ఎంతో ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. 568 ఇళ్ల నిర్మాణాలు పూర్తికావడమే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం లేఅవుట్లలో అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. ఈ సదావకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణాలను వేగవంతం చేయాలి.

–వి.సురేంద్ర, ఇన్‌చార్జ్ ఏఈఈ హౌసింగ్, పుత్తూరు

త్వరలోనే పాలు పొంగిస్తాం..



జగనన్న పుణ్యమా అని సొంతిల్లు కల నెరవేరుతుండడంతో మా ఆనందానికి అవధుల్లేవు. త్వరలోనే కళ్యాణపురం లేఅవుట్‌లోని మా సొంతింటిలో పాలు పొంగిస్తాం. ఎందుకంటే నా భర్త కృష్ణ ఆటో తోలితే వచ్చే ఆదాయమే మాకు ఆధారం. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం కాళ్లు అరిగేలా తిరిగాం. ఈ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టా చేతికి అందింది.

–మీనా, రాచపాళెం, పుత్తూరు

జగనన్నకు రుణపడి ఉంటాం..



సొంతింటి కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. సొంత తోబుట్టువులా మాకు ఇంటి పట్టా ఇవ్వడమే కాకుండా, ఇంటిని సైతం కట్టిస్తున్నారు. గత ప్రభుత్వం మాటలు మాత్రమే చెప్పింది. ఈ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాలాంటి పేదలకు ఇళ్లు కట్టిస్తోంది.

–జి.నాగలక్ష్మి, కల్యాణపురం, పుత్తూరు

సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- గడిచిన నాలుగేళ్లలో ప్రతి హామీని నెరవేర్చాం
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఆదరించండి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని నచ్చుకురు, నచ్చుకురు దళితవాడ, ఎస్టీ కాలనీ, జక్కిదొన, గంటావారిపల్లి, బోత్రావారిపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. సుస్థిర పాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ ఆదేశాలు అందేవి కాదని, నేడు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతికి రావు లేకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సువర్ణ పాలన అందిస్తున్న జగనన్న చల్లగా ఉండాలని ప్రజలు దీవిస్తున్నారని అన్నారు.

జగనన్నతోనే రోడ్లకు మహర్దశ..

ఈ నాలుగేళ్లలోనే రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు లేని మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు వేసిన చరిత్ర సీఎం జగనన్నదే అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చంద్రబాబు ఎందుకు గ్రామాలకు రోడ్లుకు వేయలేకపోయారని, నేడు అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని చంద్రబాబు, ఇంకా కొన్ని గ్రామాలకు రోడ్లు వేయలేదని మాట్లాడడం అతని నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. టీడీపీకి చెందిన కృష్ణమూర్తి యాదవ్‌తో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. మాకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్ని మా ఇంటి ముంగిటకే వస్తున్నాయని, మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో నేను టీడీపీకి ఓటు వేశానని, వచ్చే ఎన్నికల్లో జగనన్నకు ఓటు వేస్తానన్నారు. అనంతరం నచ్చుకురు ఎస్టీ కాలనీలో ఇంటి స్థలం లేని వారిని గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, నాయకులు హేమసుందర్ రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, నారాయణ రెడ్డి, రామయ్య, మునిచంద్రరెడ్డి, చిన్నబ్బ, గుణశేఖర్, వెంకటేష్, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ సుధాకర్ రావు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఒకరోజు ముందుగా గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు నాగేశ్వరరావు, విష్ణుప్రకాష్, దేవి, నరసింహులు, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి ప్రభుత్వ ప్రోత్సాహం



బొమ్మల తయారీని పరిశీలిస్తున్న పీడీ తులసి

గంగాధరనెల్లూరు: చేతివృత్తుల వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. గురువారం ఆమె మండలంలోని కడపగుంట గ్రామంలో మహిళలు తెల్లజిల్లేడుతో తయారు చేస్తున్న వినాయకుడి బొమ్మలను పరిశీలించారు. తెల్లజిల్లేడు కొయ్యలు ఎక్కడ నుంచి తెస్తారు ? రోజుకు ఎన్ని తయారు చేస్తారు ? తయారు చేసిన బొమ్మలను ఎక్కడ విక్రయిస్తారని పీడీ అడిగి తెలుసుకున్నారు. వినాయకుడి బొమ్మలను తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల వద్ద విక్రయిస్తామని తయారీదారులు తెలిపారు. మహిళలకు ప్రభుత్వం తరఫున రుణాలు అందిస్తామని, తద్వారా మరింత ఆర్థిక అభివృద్ధి సాధించాలని వారికి పీడీ సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ విజయకుమార్, ఏపీఎం చిరంజీవి కూడా పాల్గొన్నారు.

వాస్తవాలకు దూరంగా తప్పుడు రాతలు



స్కూల్ వెనుక భాగంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఇందిర




శుభ్రంగా ఉన్న పాఠశాల వెనక భాగం

- గోపాలకృష్ణాపురంలో లేని మడుగు ఉన్నట్లు చూపుతూ ఓ దినపత్రికలో ప్రచురితం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన పుత్తూరు ఎంపీడీఓ ఇందిర
- తప్పుడు కథనం ప్రచురించడంపై గ్రామస్తుల ఆగ్రహం

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గ్రామంలో ఎక్కడా చూడు మురుగు నీరే అంటూ ఓ ప్రముఖ దినపత్రికలో గురువారం 'మురుగు తొలగేదెలా' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై తక్షణం స్పందిస్తూ ఎంపీడీఓ ఇందిర గురువారం గోపాలకృష్ణాపురం వెళ్లి సదరు పాఠశాల వెనుక భాగంలోని పరిసరాలను పరిశీలించారు. అక్కడి పరిసరాలు పూర్తిగా శుభ్రంగా ఉన్నాయి. తమ గ్రామం గురించి తప్పుడు వార్తా కథనం ప్రచురించడంపై గ్రామ సర్పంచ్ వేలాయుధంతో పాటు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడో వర్షాకాలంలో నిలిచిన మురుగు నీటి ఫొటోను అటుఇటు తిప్పి తప్పుడు వార్త రాశారని ఆక్షేపించారు. తప్పుడు రాతలతో పత్రికలపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారంటూ విమర్శించారు. వాస్తవాలను తెలియజేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి పత్రికలు వారధిగా పని చేయాలని ఎంపీడీఓ హితవు పలికారు.

సాంకేతిక పరిజ్ఞానంపై మక్కువ చూపండి



రైతులతో మాట్లాడుతున్న డైరెక్టర్ విజయకుమార్

శ్రీరంగరాజపురం: రైతులు ఆధునిక వ్యవసాయంపై మక్కువ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. గురువారం ద్వామా పీడీ తులసి ఇతర అధికారులతో కలసి మండలంలోని నెలవాయి సమీపంలో మహిళా చెరుకు రైతులతో మమేకమయ్యారు. చెరుకు సాగులో జీవన వనరులు ఎలా ఉన్నాయి ? పంట సాగుకు అయ్యే ఖర్చు, దిగుబడి, మార్కెట్ సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవన వనరులు పెరగాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ఆ దిశగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులతో పాటు అధిక లాభాలు సాధించవచ్చన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఏపీఎం రోజా, ఏఓలు చిట్టిబాబు, సర్పంచ్ కుమార్, మాజీ సర్పంచ్ భూపతి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు నాణ్యంగా చేపట్టాలి

పాలసముద్రం: మండల పరిధిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను నాణ్యతగా చేయాని ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం కృష్ణజమ్మపురం, అముదాల, నరసింహపురం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. మస్టర్‌లో కొట్టివేతలు లేకుండా నమోదు చేయాల్సిన బాధ్యత సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ మునస్వామి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం.. అండగా నిలవండి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చాము
- వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం.. వచ్చే ఎన్నికల్లో మరోమారు అండగా నిలవాలని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం ఆమె నగరి మున్సిపాలిటీలోని 1వ వార్డు దిగువ పొండ్రాజుపురం, ఎగువ పొండ్రాజుపురం, ధర్మాపురం, కనంమిట్ట ప్రాంతాల్లో, 6వ వార్డు నగరి దళితవాడలో ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు, మహిళలు, పార్టీ నాయకులు గజమాలలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. ప్రతి గడపకు వెళ్లిన ఆమె ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ వారికి ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌ను అందించారు. ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై మంచి స్పందన లభించిందన్నారు. వార్డులో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు విన్నవించారు. దీనిపై మంత్రి రోజా వెంటనే సంబంధిత అధికారులను రప్పించి వెంటనే పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల పథకాలను, అభివృద్ధి పథకాలను గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు అందుతున్న ప్రజా సేవలను, లబ్ధిదారులకు నగదు నేరుగా వారి ఖాతాలోకి జమ అవుతున్న తీరును వివరించారు. గత ప్రభుత్వంలా హామీలు ఇచ్చి ప్రజలను ఏమార్చకుండా, ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చామని, వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

రాజీవ్‌నగర్‌లో ఈశ్వర్ అనే వృద్ధుడు మంచానికే పరిమితమై లేవలేని స్థితిలో ఉండగా విషయం తెలిసి ఇంటిలోపలికే వెళ్లి మంత్రి రోజా ఆ వృద్ధున్ని పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. తాను 15 ఏళ్లుగా నడవలేని స్థితిలో ఉన్నానని, తన భార్య సపర్యలు చేస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు అయిందని, మా ఇంటి వద్దే వలంటీర్ పెన్షన్ అందిస్తోందంటూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు. మండుటెండను సైతం లెక్కచేయక మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వైస్ చైర్మన్ వెంకటరత్నం రెడ్డి, నాయకులు మునివేలు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ మోహన్, మెప్మా టీఎల్‌ఎం సునీత, ఏఓ రాఘవేంద్ర యాదవ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనారిటీల సంక్షేమం

- మంత్రి ఆర్‌కే రోజా



ముస్లీం మైనారిటీలతో మంత్రి ఆర్‌కే రోజా

నగరి: మైనారిటీల సంక్షేమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం ఇఫ్తార్ విందు అంశంపై నగరి నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ సోదరులతో ఆమె సమీక్ష నిర్వహించారు. రంజాన్ వేడుకల్లో ప్రాధాన్యతను సంతరించుకునే ఇఫ్తార్ విందు నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ వేడుకలను అందరూ ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీలున్న మీరా సాహెబ్ పాళెం గ్రామాన్నే తాను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. పుత్తూరులో షాదీమహల్ నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. నవరత్నాల పథకం ద్వారా సంక్షేమాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, నాయకులు జైలాబ్దీన్, ఎంపీటీసీ ఇమ్రాన్, కోఆప్షన్ సభ్యులు హమీద్ పాల్గొన్నారు.

వైభవంగా కాలభైరవ అష్టమి పూజలు



కాళభైరవ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కాలభైరవ అష్టమి పూజలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని కాలభైరవ సన్నిధిలో సహస్ర నామావళి, అష్టోత్తర నామావళి పూజలు నిర్వహించారు. అనంతరం కాలభైరవ స్వామికి అభిషేక పూజలు చేపట్టి పుష్పాలతో అలంకరించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయదారులకు ఆలయ నిర్వాహకులు సంకల్ప పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, ప్రధాన అర్చకులు దుర్గాప్రకాష్, నవీన్ కుమార్ ఆచార్యులు, స్థానిక ఆలయ కమిటీ నిర్వాహకులు సభ్యులు పాల్గొన్నారు.

పార్సిల్ బుకింగ్ ఏజెన్సీలకు దరఖాస్తులు

పుత్తూరు రూరల్: ఆర్టీసీ పార్సిల్ బుకింగ్ ఏజెన్సీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుత్తూరు ఆర్టీసీ డిపో పరిధిలోని నారాయణవనం, తడుకుపేట, తిరుత్తణి, అరక్కోణం, కంచి, పళ్లిపట్టు, వడమాలపేట, గాజులమండ్యం, కార్వేటినగరం ఏజెన్సీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా కోరిన వారికి గ్రామాలకు సైతం ఏజెన్సీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి పార్సిల్ బుకింగ్‌కు 15 శాతం కమిషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏజెన్సీల కోసం రూ.1000 నుంచి రూ.5 వేలు వరకు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూరప్రాంత్రాలకు బల్క్ బుకింగ్, డిక్కీ బుకింగ్, రూఫ్ టాప్ బుకింగ్, డీజీటీ బుకింగ్ (10 టన్నులు) వరకు అవకాశం ఉంటుందన్నారు. వివరాల కోసం 73828 82470 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం



ముడిపల్లిలో స్టిక్కర్ అతికిస్తున్న నాయకులు

నగరి: మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ×జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్× కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇంటి యజమాని అనుమతితో గోడపై, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లను అతికిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇటువంటి పథకాలు అమలు పరచని విషయాన్ని గుర్తుచేశారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్న విధానం గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేద్దామని అందరూ అండగా నిలవాలన్నారు. భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ మళ్లీ జగనన్నను సీఎంను చేయాలన్నారు. ముడిపల్లిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, టి.గోవిందయ్య తదితరులు పాల్గొనగా, గుడికంద్రిగ గ్రామంలో సచివాలయ కన్వీనర్ రామన్ పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవాల ముగింపు



పురవీధుల్లో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడు, సీతా సమేత కోదండరాములు

కార్వేటినగరం: మండలకేంద్రంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు మూడవ రోజు గురువారం వైభవంగా ముగిశాయి. వేద పండితులు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన, కొలువు తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. వసంతోత్సవాలను పురస్కరించుకుని మధ్యాహ్నం రెండుగంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారితో పాటు కోదండ రామ స్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనె, నారికేళి, సుగంధ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అదేవిధంగా రాత్రి ఏడు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారు, అదేవిధంగా సీతాసమేత కోదండరాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దీంతో వసంతోత్సవాలు ముగిశాయి. ఆలయ సూపరింటెండెంట్ రమేష్‌బాబు, సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలతో ప్రమాదం

గంగాధరనెల్లూరు: శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే చికిత్స పొందాలని తూగుండ్రం పీహెచ్‌సీ డిప్యూటీ పారామెడికల్ అధికారి జాన్ తెలిపారు. మండలంలోని దాసరాపల్లి ఎస్టీ కాలనీలో గురువారం ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్‌తో కలిసి కుష్టువ్యాధి పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా కుష్టు వ్యాధి సోకుతుందన్నారు. మల్టీ డ్రగ్ థెరపీ మందులను ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు.